RNI No - APTEL/2022/81596

janodaya

# జనోదయ

కరీంనగర్ మంగళవారం10.03.2026 సంపుటి : 03 సంచిక : 94 పేజీలు : 08 వెల : రూ.5

Karimnagar Tuesday 10.03.2026 Volume: 03 Issue 94 Pages 08 Cost 5/

తెలుగు దినపత్రిక

## దమ్ముంటే ప్రతిపక్షాలు అభివృద్ధిపై చర్చకు రావాలి



3లో..

# మూసీని అభివృద్ధి చేసుకోవద్దా?

## పేదల ఇళ్లు కూల్చడం ప్రభుత్వ ఉద్దేశ్యం కాదు

నాలాలు, చెరువుల ఆక్రమణలతో ఇబ్బందులు

వాటిని తొలగించేందుకే పునరుద్ధరణ పనులు

మూసీ ప్రక్షాళన అడ్డుకుంటే నగరానికి అన్యాయం

ఆస్తులు కోల్పోయే వారికి పరిహారం, ఇల్లుకోల్పోతే ఇల్లు..

నల్లచెరువు ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్ రెడ్డి





"పేదల ఇళ్లు కూలగొట్టడం మా ప్రభుత్వ ఉద్దేశం కాదు. చెరువులు, నాలాలను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. దాంతో, వర్షం వస్తే ఇళ్లలోకి నీళ్లు వస్తున్నాయి. నిత్యావసరాలు పాడై ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఈ సమస్యలు తొలగించేందుకే చెరువులు, నాలాల పునరుద్ధరణ చేపడుతున్నాం. ఇందుకు సహకరించాలి. చెరువులు, నాలాలు ఆక్రమించుకున్న పెద్దలు, మిత్రులు, శ్రేయోభిషులు కూడా సహకరిస్తే బాగుంటుంది" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

6లో..

## సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై

# అభిశంసన అస్త్రం

### ఈ వారంలోనే విపక్షాలు నోటీసు



**న్యూఢిల్లీ:** దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్ ప్రక్రియలో లెక్కకు మిక్కిలిగా ఓటర్లను తొలగిస్తున్నారని, అధికార పక్షానికి అనుకూలంగా వ్యవహరిస్తూ, పారదర్శకతకు పాతరేస్తున్నారని ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ పై విరుచుకుపడుతున్న విపక్షాలు తాజాగా ఆయనపై అభిశంసన అస్త్రం ప్రయోగించేందుకు సిద్ధమవుతున్నాయి. ఇందుకు సంబంధించిన నోటీసు ముసాయిదాను 'ఇండియా' కూటమి నేతలు తయారు చేశారని, రాబోయే రెండు మూడు రోజుల్లో లోక్‌సభ స్పీకర్‌కు కానీ, రాజ్యసభ చైర్మన్‌కు కానీ సమర్పించే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు తెలిపాయి. వివాదాస్పద ఎస్ఐఆర్ ప్రక్రియ అనంతరం పెద్దఎత్తున ఓటర్లను తొలగించారంటూ పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఈనెల 6వ తేదీ నుంచి కోల్‌కతాలో నిరసన సాగిస్తున్నారు. ఎస్ఐఆర్‌తో ఓటర్లను పెద్దఎత్తున తొలగించడంపై చర్చ జరపాలంటూ టీఎంసీ ఎంపీలు ఇప్పటికే పార్లమెంటు ఉభయసభల్లోనూ నోటీసులు ఇచ్చారు. ఈ క్రమంలో సీఈసీపై అభిశంసన తీర్మానం అంశాన్ని 'ఇండియా' కూటమి ఫ్లోర్ లీడర్ల సమావేశంలో టీఎంసీ లోక్‌సభ డిప్యూటీ నేత శతాబ్ది రాయ్ ప్రస్తావించినట్టు చెబుతున్నారు. ఈ సమావేశానికి కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభలో విపక్ష నేత మల్లికార్జున్ ఖర్గే అధ్యక్షత వహించారు. మమతా బెనర్జీ నిరసనను ఈ సందర్భంగా శతాబ్ది రాయ్ ప్రస్తావిస్తూ సీఈసీపై విపక్షాలు తదుపరి చర్య చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పినట్టు తెలుస్తోంది. ఇందుకు కాంగ్రెస్ సానుకూలంగా స్పందించినట్టు చెబుతున్నారు. జ్ఞానేశ్ కుమార్‌పై విపక్షాలు అభిశంసన తీర్మానం ప్రవేశపెడితే మద్దతిస్తామని ఇటీవల ఢిల్లీలో జరిగిన మీడియా సమావేశంలో మమతా బెనర్జీ కూడా స్పష్టం చేశారు.

## ఇరాన్ నూతన సుప్రీం లీడర్‌గా

# మొజ్తాబా ఖమేనీ..

### ప్రకటించిన ఇరాన్



5లో..

ఖమేనికి కంగ్రాట్స్ చెప్పిన పుతిన్..

ఇరాన్‌కు అండగా ఉంటామని హామీ

# విద్యా కమిషన్ నివేదికలో ఉన్న వాస్తవాలేంటి?

7లో..

నిజానికి ఇలాంటి కమిషన్లు ఇచ్చే నివేదికలు డ్రాఫ్ట్ రూపంలో ముందుగా పబ్లిక్‌కు అందుబాటులో ఉంచాలి. దానిపై తిరిగి విస్తృత చర్చ, అభ్యంతరాల స్వీకరణ జరగాలి. దానిని వాస్తవ రూపంలో విశ్లేషించాలి. తదనుగుణమైన మార్పులు జరగాలి. అప్పుడు తుది నివేదిక వెల్లడి కావాలి. కానీ అలా జరగలేదు. అకస్మాత్తుగా, ఏకంగా గుదిబండలా వచ్చి పడింది.

## ఎల్‌పీజీ బుకింగ్ గడువు

# 25 రోజులకు పెంపు

**న్యూఢిల్లీ:** దేశీయ గ్యాస్ సిలిండర్ల బుకింగ్‌కు సంబంధించి నిబంధనల్లో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. ఒక సిలెండర్ డెలివరీ తర్వాత మరొక సిలిండర్ బుక్ చేయడడానికి కనీస గడువును 21 రోజుల నుంచి 25 రోజులకు కేంద్రం పెంచినట్టు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. సిలిండర్లు నిల్వచేసుకోవడం, బ్లాక్ మార్కెటింగ్‌ను నిరోధించేందుకు కేంద్రం తాజా నిర్ణయం తీసుకున్నట్టు చెబుతున్నారు. ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధం వలన కలిగే ఇంధన సరఫరా అంతరాయాలను అధిగమించేందుకు కేంద్రం తాజా చర్యలు చేపట్టింది. చమురు రిఫైనరీలకు ఎల్‌పీజీ ఉత్పత్తిని పెంచాలని, వాణిజ్య అవరసరాల కంటే గృహ అవసరాలకే అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించింది. కాగా, ఇంతకుముందు 55 రోజులకు సిలిండర్లు బుకింగ్ చేసుకునే వారు ఇప్పుడు 15 రోజుల్లోనే సిలెండర్లు బుక్ చేసుకుంటున్న సందర్భాలు చోటు చేసు కుంటున్నాయని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. కేంద్రం సైతం ఎల్జీపీ భాగస్వాముల కోసం ప్రయత్నాలు చేస్తోందని, అల్జీరియా, ఆస్ట్రేలియా, కెనడా, నార్వే దేశాలు ఇండియాకు ఎల్పీజీ అమ్మేందుకు సంప్రదింపులు సాగిసున్నాయని ఆ వర్గాలు చెప్పాయి.

### పెట్రోల్, డీజిల్ ధరలు పెరగకపోవచ్చు

క్రూడాయిల్ బ్యారెల్ ధర 130 డాలర్లు దాటనంత వరకూ పెట్రోల్, డీజిల్ ధంలు పెరగకపోవచ్చని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. భారత్ వద్ద తగినన్ని ఇంధన నిల్వలు ఉన్నాయని పేర్కొన్నాయి. క్రూడ్ ఆయిల్ బ్యారల్ ధర 100 డాలర్లు దాట కపోవచ్చని అంచనా వేస్తున్నామని, దేశం లోని ఏ ఒక్క పెట్రోల్ బంక్‌లోనూ పెట్రోల్, డీజిల్ కొరత ఉండదని ఆ వర్గాలు చెప్పాయి. ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయెల్ నిల్వలు కూడా తగినంత ఉన్నాయని, ఏటీఎఫ్ ఉత్పత్తి, ఎగుమతిదారుగా ఇండియా ఉన్నందున ఏటీఎఫ్ గురించి ఆందోళన అవసరం లేదని కూడా తెలిపాయి.



## తెలంగాణ రైతుల సొమ్ముతో రాష్ట్రంలో 'రాహుల్ బంధు' పథకం

### కేటీఆర్ ఎద్దేవా

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 'రాహుల్ బంధు' అనే కొత్త పథకాన్ని ప్రవేశపెట్టారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఈ రాహుల్ బంధు పథకాన్ని రైతులకు ఇచ్చే రైతుబంధు నిధులతో మొదలుపెట్టాడని విమర్శించారు. సిరిసిల్ల మున్సిపల్ ఎన్నికల్లో ఇటీవల గెలుపొందిన బీఆర్ఎస్ కౌన్సిలర్ల ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడారు. సంవత్సరానికి రూ. 1,000 కోట్ల రూపాయలు రాహుల్ గాంధీకి ఇచ్చే రాహుల్ బంధు పథకం మాత్రం తెలంగాణలో పక్కాగా రేవంత్ రెడ్డి అమలు చేస్తున్నారని విమర్శించారు.



5లో..

# రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి

**ప్రమాదాలు చోటు చేసుకుంటున్న హసన్‌పర్తి పెద్ద చెరువు కట్ట మూల మలుపు వద్ద రోడ్డు విస్తరణ చేయాలి**

**హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్**

**హసన్ పర్తి వద్ద బ్లాక్ స్పాట్స్‌ను వివిధ శాఖల అధికారులతో కలిసి పరిశీలించిన జిల్లా కలెక్టర్**

**రోడ్డు ప్రమాదాల నివారణకు అధికారులకు ఆదేశం**



జనోదయ : హనుమకొండ మార్చి 09

హనుమకొండ జిల్లా హసన్ పర్తి మండల కేంద్రంలో వరంగల్ కరీంనగర్ మార్గంలో ఉన్న హసన్ పర్తి పెద్ద చెరువు కట్ట మూలమలుపు సమీపంలో తరచుగా రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుని ప్రాణనష్టం సంభవిస్తున్న నేపథ్యంలో జాతీయ రహదారులు, ఆర్ అండ్ బి, సాగు నీటి పారుదల, పోలీస్, రెవెన్యూ శాఖల అధికారులతో కలిసి ప్రమాదకరంగా ఉన్న బ్లాక్ స్పాట్స్ ను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఇటీవల హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ ( దిశా ) సమావేశంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కె ఆర్ నాగరాజు హసన్ పర్తి పెద్ద చెరువు కట్ట మూలమలుపు వద్ద చోటు చేసుకుంటున్నా రోడ్డు ప్రమాదాలు,జరుగుతున్న ప్రాణ నష్టం పై ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్, సంబంధిత అధికారులకు తెలియజేయగా కలెక్టర్ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న బ్లాక్ స్పాట్స్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, రోడ్డు విస్తరణకు ఉన్న అవకాశాలను ఆయా శాఖల అధికారులతో కలెక్టర్ అక్కడికక్కడే సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ మాట్లాడుతూ హసన్ పర్తి పెద్ద చెరువు కట్ట మూలమలుపు వద్ద ప్రమాదాలు చోటు చేసుకున్న బ్లాక్ స్పాట్ ప్రాంతంలో రోడ్డు విస్తరణ చేపట్టాలని జాతీయ రహదారుల శాఖ అధికారులను ఆదేశించారు. రోడ్డు విస్తరణతో ప్రమాదాలు తగ్గుతాయి కాబట్టి ఆ దిశగా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా వరంగల్ ప్రాజెక్టు డైరెక్టర్ భరద్వాజ్, ఆర్ అండ్ బి ఈఈ సురేష్ బాబు, హనుమకొండ ఆర్డీవో రాథోడ్ రమేష్, తహసీల్దార్ కిరణ్ కుమార్, పోలీస్ ఇన్స్పెక్టర్ చేరాలు , సాగునీటిపారుదల, మున్సిపల్ శాఖల అదికారులు, తదితరులు పాల్గొన్నారు.

## డబుల్ బెడ్ రూం కాలనీ వాసుల వితరణ



జనోదయ : మందమర్రి మార్చి 9

పట్టణంలోని డబుల్ బెడ్ రూమ్ కాలనీకి చెందిన చంటి మల్లేశ్వరి ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, కాలనీవాసులు మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం అందించారు. గత నెల 25న క్యాతనపల్లిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మల్లీశ్వరి మరణించగా,కాలనీ వాసులు కలిసి జమ చేసిన 30 వేల రూపాయల నగదును సోమవారం డబుల్ బెడ్ రూమ్ కాలనీలోని బాధితురాలి కుటుంబ సభ్యులకు అందించారు. ఈసందర్భంగా మల్లేశ్వరి మృతికి సంతాపం తెలుపుతూ,వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## ఆడపడుచుకు పెళ్లి కానుక అందించిన రాంబాబు



జనోదయ : మందమర్రి మార్చి 9

పట్టణంలోని మార్కెట్ ఏరియాకు చెందిన ఆటో డ్రైవర్ పొన్నం శంకర్ గౌడ్ కూతురు మానస వివాహానికి పట్టణ ఆటో యూనియన్ అధ్యక్షులు మొయ్య రాంబాబు పెళ్ళి కానుక అందించి అండగా నిలిచారు. సోమవారం జరిగిన వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆటో యూనియన్ ఎన్నికల సందర్భంగా ప్రకటించిన మానిఫెస్టో ప్రకారం ఆటో యూనియన్ సభ్యుల కూతురు వివాహానికి 2016 కానుకగా ఇస్తానని ప్రకటించగా మానిఫెస్టో ప్రకారం ఆడపడుచు వివాహ కానుక అందచేశారుఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ ఉపాధ్యక్షులు బత్తిని రాజేష్ యాదవ్,రమేష్,శంకర్,దుర్గం శీనులు పాల్గొన్నారు.






# యలమంచి ఉదయ్ కిరణ్‌కు 'సేవా రత్న' అవార్డు



జనోదయ : శేరిలింగంపల్లి మార్చి 09

ప్రముఖ సామాజిక కార్యకర్త, యలమంచి ఉదయ్ కిరణ్ చారిటబుల్ ట్రస్ట్ స్థాపకుడు, చైర్మన్ యలమంచి ఉదయ్ కిరణ్‌కి ప్రతిష్టాత్మకమైన "సేవా రత్న" అవార్డు ప్రదానం చేశారు. గచ్చిబౌలిలోని ఎస్ఆర్ కన్వెన్షన్‌లో ఘనంగా నిర్వహించిన "కమ్మ ఐకాన్ లెజెండరీ అవార్డ్స్–2026" కార్యక్రమంలో ఆయన ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏ.ఎస్.వి. రామారావు చౌదరి (డైరెక్టర్, కమ్మ సంక్షేమ అభివృద్ధి సంస్థ),రాజకీయ విశ్లేషకులు బండారు మనోహర్ నాయుడు,అప్పసాని రాజేష్, ముప్పా అంకమ్మ రావు చౌదరి,కాకర్ల రంగనాథ్ తదితర ప్రముఖులు హాజరై యలమంచి ఉదయ్ కిరణ్ కు అవార్డును అందజేసి అభినందించారు. సమాజ సాధికారత,ప్రజాసేవ, నాయకత్వ రంగాలలో ఆయన చూపుతున్న విశిష్ట సేవలకు గుర్తింపుగా ఈ అవార్డును ప్రదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు ఉదయ్ కిరణ్ సేవా కార్యక్రమాలను ప్రశంసించారు. ఇప్పటికే సామాజిక సేవలో విశేష కృషికి గాను గౌరవ డాక్టరేట్, సేవా రత్న నేషనల్ అవార్డు (జిహెచ్ పీయు), అబ్దుల్ కలాం నేషనల్ సేవా రత్న పురస్కారం (విశ్వ ఆర్ట్స్, మన కళాక్షేత్రం), బెస్ట్ అచీవ్‌మెంట్ అవార్డు (ప్రెస్ వింగ్స్ క్లబ్) వంటి పలు జాతీయ స్థాయి పురస్కారాలను కూడా ఆయన అందుకున్నారు. యలమంచి ఉదయ్ కిరణ్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా మియాపూర్ డివిజన్ పరిధిలో సమ్మర్ కూలింగ్ స్టేషన్స్ ఏర్పాటు, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు– జ్యామెట్రీ బాక్సుల పంపిణీ, వృద్ధాశ్రమాలలో పండ్ల పంపిణీ, ఉచిత మెడికల్ క్యాంపులు, అనాథాశ్రమాలలో అన్నదానం, దివ్యాంగులకు అవసరమైన సామగ్రి పంపిణీ, క్రీడలను ప్రోత్సహించే కార్యక్రమాలు, ఉచిత కంటి పరీక్షలు, పేద విద్యార్థులకు ఫీజుల చెల్లింపు, మహిళా దినోత్సవ వేడుకల్లో మహిళల సన్మానం, జిహెచ్ఎంసి కార్మికులకు భోజన పంపిణీ వంటి పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా స్పందించిన యలమంచి ఉదయ్ కిరణ్ మాట్లాడుతూ.. ఈ అవార్డు తమ ట్రస్ట్ వాలంటీర్లు, మద్దతు దారుల సమిష్టి కృషికి లభించిన గౌరవమని,భవిష్యత్తులో పేదలు, అణగారిన వర్గాలకు మరింత సేవలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు నవ్యశ్రీ,లావణ్య,రాధాకృష్ణ,రమేష్, వంశీ,ప్రవీణ్,రాజేష్ చౌదరి,నాగసాయి,సాయి నిఖిల్, రాజేష్,సతీష్,వినోద్,నాని,వినయ్,శివ,పాల్గొన్నారు.

# మియాపూర్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

జనోదయ : శేరిలింగంపల్లి మార్చి 9

మియాపూర్ డివిజన్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని యలమంచి ఉదయ్ కిరణ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పలు కాలనీలకు చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా సంగీతం, సామాజిక సేవ, ఐటీ, న్యాయ వృత్తి తది తర రంగాలలో ప్రతిభ కనబరిచిన సుమారు 60 మంది మహిళ లను శాలువాలతో సత్కరించి "మహిళా ప్రతిభా పురస్కారాలు" అందజేశారు. అనంతరం కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యలమంచి ఉదయ్ కిరణ్ మాట్లాడుతూ.. సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమని, మహిళల సంక్షేమానికి తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు, మహిళలు, ట్రస్ట్ సభ్య లు కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు ఎండి షా, భాస్కర్ రెడ్డి, లోకేష్, కేశవ్, ప్రసాద్, రమేష్, శంకర్, రాణి, కవిత, శశి. యలమంచి నవ్యశ్రీ తో పాటు టీమ్ సభ్యులు శరత్, రాధాకృష్ణ, రమేష్, వంశీ, ప్రవీణ్, రాజేష్ చౌదరి, నాగసాయి, సాయి నిఖిల్, రాజేష్, సతీష్, వినోద్, నాని, వినయ్, శివ తదితరులు హాజరయ్యారు. ఈ కార్యక్రమం మహిళా సాధికారత, ఐక్యతను పెంపొందించే దిశగా విజయవంతంగా నిర్వహించారు.



# దమ్ముంటే ప్రతిపక్షాలు అభివృద్ధిపై చర్చకు రావాలి

**రెండేళ్లలోనే అభివృద్ధి పనులు పూర్తి చేశాం**

**వరంగల్ రూపురేఖలు మార్చనున్న యుజిడి ప్రాజెక్ట్**

**ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**

**మాటల ప్రభుత్వం కాదు.. చేతల ప్రభుత్వం**

**ఎమ్మెల్యే కె ఆర్ నాగరాజు**

**జనోదయ : హనుమకొండ, మార్చి 9:**



అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ప్రాజెక్టును ఎన్నికలలో హామీ ఇచ్చిన మాట ప్రకారం నిర్ణీత సమయానికి పనులు పూర్తి చేస్తామని, ఇప్పటికైనా ప్రతిపక్ష పార్టీలు అవాకులు చవాకులు పేలడం మాని దమ్ముంటే వరంగల్ నగర అభివృద్ధిపై  చర్చకు రావాలని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సవాల్ విసిరారు.హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమ వారం నిర్వహించిన మీడియా సమావేశంలో  ఎమ్మెల్యే వర్ధన్నపేట ఎమ్మెల్యే కే. ఆర్.నాగరాజు,వరంగల్ మేయర్ గుండు సుధారాణి, డిసిసి అధ్యక్షులు, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి లతో కలిసి మాట్లాడారు.గతంలో ఎంతోమంది నాయకులు రాజకీయ స్వలాభాల కోసం మాత్రమే పనిచేశారని,కానీ అభివృద్ధి విషయంలో మాత్రం ప్రజలను నిరాశపరిచారని విమర్శించారు.వరంగల్ నగరానికి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు చేస్తామని గత పాలకులు ఎన్నోసార్లు చెప్పినా ఆచరణలోకి తీసుకురాలేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ముందుకు సాగుతోందని చెప్పారు.

**వరంగల్ నగర అభివృద్ధి ధ్యేయంగా...**

వరంగల్ త్రినగరికి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, మామునూరు విమానాశ్రయం, నగర మాస్టర్ ప్లాన్ అమలు వంటి కీలక అభివృద్ధి కార్యక్రమాలకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఇచ్చిన మాట ప్రకారం రూ.5257. 20 కోట్ల నిధులను కేటాయిస్తూ జీఓ నెంబర్ 322 ద్వారా పరిపాలన పరమైన అనుమతులు ప్రభుత్వం మంజూరు చేసినట్లు తెలిపారు.ఈ ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్ ఇప్పటికే సిద్ధమైందని, క్షేత్ర స్థాయిలో ప్రముఖ సంస్థ ద్వారా పూర్తి ప్రణాళికతో తయారు చేయించినట్లు వెల్లడించారు.కాంగ్రెస్ ప్రభుత్వం పనులు ప్రారంభిస్తే వాటిని చూసి ఇతర పార్టీలు పాలాభిషేకాలు చేసుకోవడం విచిత్రంగా ఉందని వ్యాఖ్యానించారు.బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ మొద్దు నిద్రలో ఉండి ఇతరులు చేసిన పనులను తామే చేసినట్టు చెప్పుకుంటుందని విమర్శించారు.

**ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ...**

కాంగ్రెస్ ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వం అని నిరూపించుకుంటుందని అన్నారు. పార్టీలకతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందే విధంగా కృషి చేస్తూ అర్హులైన పేదలకు న్యాయం చేస్తుందని తెలిపారు.రాబోయే గ్రేటర్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి అండగా నిలవాలని కోరారు.అనంతరం కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున బాణాసంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు.

# ఆరోగ్యం కోసమే 5కే రన్

**మేయర్ గుండు సుధారాణి**

**జనోదయ : హనంకొండ మార్చి 9**



ఆరోగ్య సంరక్షణపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు 5కే రన్  నిర్వహించినట్లు మేయర్ గుండు సుధారాణి తెలిపారు.“ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక” కార్యక్రమం అమలులో భాగంగా సోమవారం జీడబ్ల్యూఎంసీ ఆధ్వర్యంలో పోచమ్మ మైదాన్ నుంచి హనుమకొండ వెయ్యిస్థంభాల ఆలయం వరకు నిర్వహించిన 5కే రన్‌ను వరంగల్ జిల్లా కలెక్టర్ డా. సత్య శారద, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్‌లతో కలిసి మేయర్ జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.ప్రతిరోజు ప్రజల భాగస్వామ్యంతో వివిధ కార్యక్రమాలు నిర్వహించాలని సీఎం ఆదేశించినట్లు తెలిపారు. ప్రజల సహకారం, భాగస్వామ్యం ఉన్నప్పుడే ఏ అభివృద్ధి కార్యక్రమం అయినా విజయవంతం అవుతుందని పేర్కొన్నారు.గ్రేటర్ వరం గల్ ప్రజలకు తాగునీటి సరఫరా, పారిశుధ్యం వంటి సేవలను జీడబ్ల్యూఎంసీ ద్వారా అందిస్తున్నామని మేయర్ తెలిపారు.వరంగల్ జిల్లా కలెక్టర్ డా. సత్య శారద మాట్లాడుతూ... ప్రజల్లో ఆరోగ్యంపై చైతన్యం పెంచేందుకు ఇవి దోహదపడతాయని పేర్కొన్నారు. హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ మాట్లాడుతూ... ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. ఆరోగ్యానికి మించిన ఆస్తి ఏదీ లేదని, ఆరోగ్యంగా ఉంటేనే జీవితంలో విజయాలు సాధించగలమని అన్నారు.కార్యక్రమంలో కార్పొరేటర్లు సురేష్ జోషి, బస్వరాజు కుమారస్వామి, జన్ను శిభారాణి, అదనపు కమిషనర్ చంద్రశేఖర్, సీహెచ్ఎంఓ డా. రాజా రెడ్డి, సీహెచ్ఓ రమేష్, హనుమకొండ డీవైఎస్ఓ అశోక్, సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, ఎంహెచ్ఓ డా. రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ ఫైళ్లను పరిష్కరించాలి

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**జనోదయ : మందమర్రి మార్చి 9**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన  ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా అభివృద్ధి పనులను కొనసాగిస్తూ కార్యాలయాలలో పెండింగ్ పైళ్లను త్వరగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలో చేపట్టిన ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్  మాట్లాడుతూ జూన్ 12వ తేదీ వరకు కార్యాచరణ రూపొందించడం జరిగిందని, క్షేత్రస్థాయిలో సమర్ధవంతంగా అమలు చేయాలన్నారు. గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలలో 99 రోజుల పాటు కార్యచరణ అమలు చేయడం జరుగు తుందన్నారు. పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి సారించ డం, ప్రభుత్వ కార్యాలయాలలో పెండింగ్ పైళ్లను  పూర్తిగా పరిష్కరించాలని సూచించారు.ప్రభుత్వ శాఖల అధికారులు వారి పరిధిలోని అంశాలపై ప్రణాళికలు సిద్ధం చేసి దశల వారీగా పూర్తి  చేయాలని తెలిపారు.ప్రభుత్వ పాఠశాలలలో,కళాశాలల్లో విద్యార్థుల సంఖ్యను  పెంపొందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

# ఎంజీఎంలో దివ్యాంగులకు ప్రత్యేక కౌంటర్

**జనోదయ : హనుమకొండ, మార్చి 9**



మహాత్మా గాంధీ మెమోరియల్ (ఎంజీఎం) ఆసుపత్రిలో దివ్యాంగుల సౌకర్యార్థం ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయాలని ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశించారు.జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో  కలెక్టర్  ప్రజల నుండి వినతిపత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజలు సమర్పించిన దరఖాస్తులను పరిశీలించి,సంబంధిత శాఖల అధికారులతో దరఖాస్తుదారుల సమక్షంలోనే చర్చించారు.అనంతరంప్రజావాణిలో అందిన వినతులను ఆలస్యం చేయకుండా త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఒకే సమస్యపై దరఖాస్తుదారులు పదేపదే కార్యాలయాలకు రావాల్సిన పరిస్థితి రాకుండా చూడాలని సూచించారు.ఏదైనా సమస్యను పరిష్కరించలేని పరిస్థితి ఉన్నట్లయితే దానికి గల కారణాలను దరఖాస్తుదారులకు స్పష్టంగా తెలియజేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.రెవెన్యూ శాఖకు సంబంధించిన దరఖాస్తులు అధికంగా వచ్చిన నేపథ్యంలో వాటిని సంబంధిత తహసీల్దార్లకు ఎండార్స్ చేసి త్వరితగతిన పరిష్కారం చేయాలని ఆదేశించారు.కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జి. సంధ్యారాణి, వరంగల్ మరియు నర్సంపేట ఆర్డీవోలు సుమ,ఉమారాణి,హౌసింగ్ పీడీ శ్రీవాణి, జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ,డీసీఓ నీరజ, డీబీసీ డీఓ పుష్పలతతో పాటు వివిధ శాఖలఅధికారులు,ప్రజలు పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్యాలయాన్ని పరిశుభ్రంగా ఉంచాలి

**జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) పి చంద్రయ్య**

**జనోదయ : మందమర్రి మార్చి 9:**

మున్సిపల్ కార్యాలయంతో పాటు కార్యాలయంలోని అన్ని విభాగాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి చంద్రయ్య సూచించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళికా (99రోజులు) కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కార్యా లయాన్ని సందర్శించి, ప్రతి విభాగాన్ని పరిశీలించారు. ప్రతి విభాగాన్ని శుభ్రంగా నిర్వహించుకోవాలని, విభాగాల వారీగా పెండింగ్ ఫైళ్లను తనిఖీ చేసి, మిగిలిన ఫైళ్లను వీలైనంత త్వరగా పరిష్కరించాలన్నారు.అనంతరం 23 వార్డ్ మారుతి నగర్ లో గల మినీ ట్యాంక్ బండ్ వద్ద నిర్వహిస్తున్న స్వచ్ఛత కార్యక్రమాన్ని పరిశీలించారు. 24వ వార్డ్ మందమర్రి (వి) గ్రామాన్ని సందర్శించి, స్థానిక ప్రజలతో సమావేశమై, పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, రేషన్ పంపిణీ, వీధి దీపాలు తదితర అంశాలపై ప్రజలసమస్యలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా వార్డ్ లోని పల్లె దవాఖాన, అంగన్వాడి కేంద్రం, పశు ఆసుపత్రిని సందర్శించి, అక్కడి సేవల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు అందిస్తున్న సేవలు సమర్ధవంతంగా కొనసాగించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, మార్చి 6 నుంచి జూన్ 12 వరకు 99 రోజుల కార్యచరణ రూపొందించడం జరిగిందని, క్షేత్రస్థాయిలో సమర్ధవంతంగా అమలు చేయాలని తెలిపారు. గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలలో కార్యచరణ అమలు చేయడం జరుగుతుందన్నారు. మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీ లలో పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి సారించడం,ప్రభుత్వ కార్యాలయాలలో పెండింగ్‌లో ఉన్న ఫైళ్ల క్లియరెన్స్, ఆరోగ్యం, అరైవ్ అలైవ్, సంక్షేమం, పిల్లలు భద్రత,వ్యవసాయం,విద్య,యువత,మహిళలు, పర్యావరణం తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసి దశల వారీగా పూర్తి చేయాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో, కళాశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంపొందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వేసవి దృష్ట్యా త్రాగునీటికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, చిన్న సమస్యలు పరిష్కరించాలని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, వైద్యులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ తుంగపిండి రాజలింగు, మున్సిపల్ రెవెన్యూ అధికారి పి కృష్ణ ప్రసాద్, మేనేజర్ టి రాజేశ్వరి, ఇంచార్జ్ శానిటరీ ఇన్స్పెక్టర్ ఈ వసంత్, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్, హెల్త్ అసిస్టెంట్ ఎంఎ సమీర్, డేటా ప్రాసెసింగ్ అధికారి బి శ్యాం బాబు, సిస్టం మేనేజర్ ఆకరి శిరీష్, సిస్టం అసిస్టెంట్ వి ప్రభాకర్ రెడ్డి, స్థానిక ప్రజలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



# వరంగల్ అభివృద్ధిపై కేంద్రం 'ప్రత్యేక నజర్'

**బీజేపీతోనే నగరాభివృద్ధి**

**వరంగల్‌కు భారీగా నిధులు కేటాయిస్తున్న ప్రధాని**

**అండర్ గ్రౌండ్ డ్రైనేజ్‌కి**

**నిధులు కేటాయించడం అభినందనీయం**

**బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్**

**వరంగల్ మునిసిపల్ కార్యాలయం వద్ద**

**ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం**

వరంగల్ జిల్లా ప్రతినిధి : (జనోదయ) మార్చి 09

గ్రేటర్ వరంగల్ అభివృద్ధికి ప్రధాని నరేంద్ర మోదీ భారీగా నిధులు కేటాయిస్తున్నారని, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ అన్నారు. కేంద్ర పథకం అర్బన్ ఛాలెంజ్ ఫండ్ ద్వారా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పథకానికి నిధుల సమీకరణ లో భాగంగా విదేశీ సహాయం, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో కలిసి కేంద్రం నిధుల్ని సమీకరించడం తో గంట రవికుమార్ హర్షం వ్యక్తం చేశారు.ఈమేరకు సోమవారం గ్రేటర్ మున్సిపల్ కార్యాలయం వద్ద ప్రధాని నరేంద్ర మోడీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం గంట రవికుమార్ మాట్లాడుతూ.. ఈ పథకం కింద 5257.20 కోట్లతో చేపట్టే పనులకు పాలనా పరమైన అనుమతి మంజూరు చేస్తూ..మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ ఉత్తర్వులు జారీ చేయడం హర్షణీయమన్నారు. కేంద్రం భారీగా నిధులు ఇస్తున్న ఖర్చు చేయడంలో పాలకులు పూర్తిగా విఫలం అవుతున్నారని పేర్కొన్నారు. గ్రేటర్ వరంగల్ అభివృద్ధిపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని గంట రవి కుమార్ అన్నారు. ఇప్పటికే ఎయిర్పోర్టు మంజూరు చేసిన కేంద్రం తాజాగా అండర్ డ్రైనేజీకి నిధులు మంజూరు చేసిందని, ఇప్పటికే స్మార్ట్ సిటీ లో భాగంగా అనేక నిధులు ఇచ్చి నగరం రూపురేఖలు మార్చిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ రెండేళ్ల పాలనలో హామీలు తప్ప అభివృద్ధి చేసింది లేదని విమర్శించారు. ఓట్ల కోసం ఇచ్చే హామీలు తప్ప ప్రజల బాగోగులు పట్టించుకున్న దాఖలు లేవని దుయ్యబట్టారు. కేంద్రం నిధులు ఇస్తున్న.. రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చేయడంలో నిర్లక్ష్యం వహిస్తుందని ఆరోపించారు.బండ్ పనుల్లో ఆలస్యం చేస్తున్నారని విమర్శించారు. గ్రేటర్ వరంగల్ ఇప్పటి వరకు అభివృద్ధి చెందిందంటే అది కేవలం కేంద్ర ప్రభుత్వం నిధులతోనే అని స్పష్టం చేశారు. వరంగల్లో బిజెపి ఎమ్మెల్యే కానీ ఎంపీ అభ్యర్థి లేకపోయినా కూడా కేంద్రం నిధులు ఇస్తుందని, అదే అధికారంలో ఉంటే ఇంకేం నిధులు వస్తాయని గంట రవికుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎర్రబెల్లి ప్రదీప్ రావు,కుసుమ సతీష్, రత్నం సతీష్ షా,వన్నాల వెంకట రమణ, జిల్లా ప్రధాన కార్యదర్శిలు బాకం హరిశంకర్, బన్న ప్రభాకర్, బిజెపి కార్పొరేటర్ గందె కల్పనా నవీన్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు కందిమల్ల మహేష్, బైరి నాగరాజు మరియు జిల్లా పదాధికారులు, వివిధ మోర్చా జిల్లా అధ్యక్షులు, మండల అధ్యక్షులు, బిజెపి నాయకులు, మహిళా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





# మృతురాలి కుటుంబానికి అండగా నిలిచిన మంత్రి వివేక్

**జనోదయ : మందమర్రి మార్చి 9**

ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన డబుల్ బెడ్ రూమ్ కాలని వాసి చంటి మల్లీశ్వరి కుటుంబానికి రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అండగా నిలిచారు. రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన బాదితురాలి కుటుంబ పరిస్థితిని పట్టణ కాంగ్రెస్ నాయకులు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన ఆయన 10 వేల రూపాయలు పట్టణ కాంగ్రెస్ నాయకుల ద్వారా సోమవారం అందచేశారు.ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు నోముల ఉపేందర్ గౌడ్,ఉమ్మడి ఆదిలాబాద్ మాజీ జనరల్ సెక్రటరీ సోత్కు సుదర్శన్,డిసిసి ఉపాధ్యక్షులు పుల్లూరి లక్ష్మణ్,మాజీ పిసిసి సభ్యులు గుడ్ల రమేష్, చెన్నూరు మాజీ యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ వడ్లూరి సునీల్ కుమార్, సేవాదళ్ జిల్లా ఉపాధ్యక్షులు ఎండి పాషా, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శనిగారపు సాగర్, పట్టణ యువజన నాయకులు రాయబారపు కిరణ్, పానుగంటి లక్ష్మణ్, ఎర్ర రాజు, ధనుక్, రాజేష్, సతీష్, విజయ్ లు పాల్గొన్నారు.



జనోదయ



# పది విద్యార్థులకు పరీక్ష సామాగ్రి పంపిణీ

జనోదయ : చందుర్తి



పది తరగతి పరీక్షలకు చందుర్తి మండలం మల్యాల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 47 మంది విద్యార్థిని, విద్యార్థులకు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు శ్రీ లక్ష్మీ గణపతి సూపర్ మార్కెట్ అధినేత కొత్త శ్రీకాంత్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శరత్ చంద్ర సమక్షంలో పరీక్షలు రాసే విద్యార్థులకు అవసరమైన పెన్నులు, పెన్సిళ్లు, ఎగ్జామ్ ప్యాడ్‌లు, స్కేళ్లు,ఇతర పరికరాల కిట్‌లను సోమవారం ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా, ఆత్మవిశ్వాసంతో సమయపాలన పాటిస్తూ పరీక్షలు రాసి ఈ సంవత్సరం పదవ తరగతి ఎగ్జామ్ లో మన గ్రామం నుండి మండల స్థాయిలో మంచి ఉత్తీర్ణత పొందాలని,మండల స్థాయిలో మొదటి ర్యాంకు రెండవ ర్యాంకు మన విద్యార్థులకు రావాలని, ఆశిస్తూ మంచి ఫలితాలు సాధించాలని కోరారు.పరీక్ష సమయానికి ముందు ఇటువంటి సహాయం విద్యార్థులకు చాలా ప్రోత్సాహకరంగా నిలుస్తుందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు శరత్ చంద్ర పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ మాందాల అబ్రహం, గ్రామ యువకులు గుంటపల్లి రాజయ్య, లోకోజి సతీష్ కుమార్, కృష్ణ, అభి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# పొద్దు తిరుగుడు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి

జనోదయ : దౌల్తాబాద్



రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పద్దుతిరుగు పంట దళారులకు విక్రయించకుండా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని యువ రైతు భాస్కర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ.. రైతు ప్రభుత్వం అంటూ గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు చేసిందేమీ లేదని విమర్శించారు.యాసంగి సాగులో ఆరుతడి పంటలైన పొద్దు తిరుగుడు పంట కొతకు వచ్చిందని రైతులు అమ్ముకోవడానికి కొనుగోలు కేంద్రాలు లేక నాన్న ఇబ్బందులు పడుతున్నారని ఆవివేదన వ్యక్తం చే శారు. వేలాది రూపాయల పెట్టుబడులు పెట్టి రైతన్నలు ఎంతో కష్టపడి పొద్దు తిరుగుడు పంటలను ఈసారి అధికంగా రైతులు సాగు చేశారని గుర్తు చేశారు.పంట చేతికి వచ్చిన సమయంలో కొనుగోలు కేంద్రాలు లేకపో వడం వలన దళారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. రాయపోల్.దౌల్తాబాద్.తొగుట.మిరుదొడ్డి మండలాల్లో ఎక్కడైనా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తే ఈ ప్రాంత రైతాంగానికి ఎంతో మేలు జరుగుతుందని. ప్రభుత్వం. జిల్లా అధికారులు ఈ విషయంలో స్పందించి వెంటనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని రైతుల పక్షాన డిమాండ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. గత సంవత్సరం కొనుగోలు కేంద్రాలు లేక పోవడం వలన రైతులు దళారులను ఆశ్రయించి మోస పోయారని గిట్టుబాటు ధర లభించకపోవదంతో రైతులకు తీవ్ర అన్యాయం జరిగిందని అన్నారు. పొద్దు తిరుగుడు పంట కొనుగోలు తోపాటు మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతో ఉం దన్నారు.ఈ ప్రభుత్వానికి రైతులపై ప్రేమ ఉంటే వెంటనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆయన కోరారు

## హఫీజ్ పేట్ డివిజన్‌లో

# అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్యను వెంటనే పరిష్కరించాలి

జనోదయ: శేరిలింగంపల్లి



కైతాపురం జితేందర్ బీజేపీ అధ్యక్షులు హఫీజ్ పేట్ డివిజన్,ఈ రోజు హఫీజ్ పేట్ డివిజన్ బీజేపీ అధ్యక్షులు కైతాపురం జితేందర్ ఆధ్వర్యంలో హఫీజ్ పేట్ డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో నీ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్యపై హఫీజ్ పేట్ కార్యాలయం, ప్రజావాణిలో,వాటర్ వర్క్స్ డిపార్ట్మెంట్ జనరల్ మేనేజర్‌కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది.హఫీజ్ పేట్ డివిజన్ హుడా కాలనీ విద్యా వాణి హై స్కూల్ వద్ద కొత్తగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ లైన్ తక్కువ సైజ్ మట్టి పైపులతో వేస్తున్న సందర్భంగా డ్రైనేజ్ లైన్ సిమెంట్ పైపులతో 2 ఫీట్ల సైజ్ డ్రైనేజ్ లైన్ వెయ్యాలి అని తెలపడం జరిగింది.హఫీజ్ పేట్ డివిజన్ జనప్రియ అపార్ట్ మెంట్ 5వ ఫేస్, ఇంజనీర్ ఎంక్లేవ్ , హఫీజ్ పేట్ విలేజ్ , సాయి నగర్ , యూత్ కాలనీలో వివిధ ప్రధాన కూడలి వద్ద అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్యను వెంటనే పరిష్కరించాలి అని ప్రజావాణిలో వినతిపత్రం ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో హఫీజ్ పేట్ డివిజన్ బీజేపీ ప్రధాన కార్యదర్శి జగన్ గౌడ్, డివిజన్ బీజేపీ ఉపాధ్యక్షులు ప్రసాద్ పాత్రో,బీజేపీ డివిజన్ కార్యదర్శి సుబ్బారావు,బీజేపీ నాయకులు హరీష్ మరియు ఇతరులు పాల్గొన్నారు.

## ఇరాన్ నూతన సుప్రీం లీడర్‌గా ఖమేనీ తనయుడు

# మొజ్తాబా ఖమేనీ..

## ప్రకటించిన ఇరాన్

ఇరాన్ తమ దేశ నూతన సుప్రీం లీడర్‌ను ఎన్నుకుంది. కొత్త సుప్రీం లీడర్‌గా అయతొల్లా ఖమేనీ తనయుడు మొజ్తాబా ఖమేనీని ఎన్నుకున్నట్లు ఇరాన్ అధికారికంగా ప్రకటించింది. 56 ఏళ్ల అయతొల్లా సయ్యద్ మొజ్తాబా హొస్సేని ఖమేనీ అలియాస్ మొజ్తాబా ఖమేనీ ఇరాన్‌కు మూడో సుప్రీం లీడర్‌గా ఎన్నికయ్యాడు. మొజ్తాబాను ఇరాన్ అసెంబ్లీ నిపుణుల బృందం ఎన్నుకుంది.ఇందులో 88 మంది ఇస్లాం మత గురువులు ఉంటారు. వీరందరూ కలిసి ఆదివారం సమావేశమై కొత్త సుప్రీం లీడర్ కోసం చర్చ జరిపారు. మెజారిటీ సభ్యులు మొజ్తాబా వైపు మొగ్గు చూపారు. కొందరు సభ్యులు వారసత్వ నాయకత్వాన్ని వ్యతిరేకించినప్పటికీ.. మెజారిటీ ఉండటంతో మొజ్తాబానే ఎన్నుకున్నారు. ఒకవైపు ఇరాన్‌పై దాడులు కొనసాగుతున్నా, మిడిల్ ఈస్ట్‌లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నప్పటికీ కొత్త లీడర్ ఎంపికను ఇరాన్ పూర్తి చేసింది. అతడు, ఎప్పటినుంచి బాధ్యతలు స్వీకరిస్తారో తెలియరాలేదు. మొజ్తాబాకు విదేశాల్లో భారీగా ఆస్తులున్నాయి. అతడికి లండన్‌లో దాదాపు 2,500 కోట్లకుపైగా ఆస్తులున్నట్లు అంచనా. కెన్సింగ్‌టన్ ప్యాలెస్‌లో అతడికి ఖరీదైన అపార్ట్‌మెంట్లు ఉన్నాయి. 2014 నుంచి లండన్‌లో ఆస్తులు కలిగి ఉన్నాడు. ఇక ఇటీవలి పరిణామాల నేపథ్యంలో లండన్‌లోని అతడి ఆస్తులపై ఇజ్రాయెల్, అమెరికా నిఘా ఉంచినట్లు తెలుస్తోంది. అతడి ఆస్తులకు భద్రతాపరమైన ముప్పు ఉందని నిపుణులు అంచనావేస్తున్నారు. మరోవైపు మొజ్తాబా ఎంపికను అమెరికా, ఇజ్రాయెల్ అంగీకరించడం లేదు. కొత్త సుప్రీం లీడర్‌ను ఎన్నుకునేముందు తమ అనుమతి తీసుకోవాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సూచించారు. అలాగే కొత్త లీడర్ ఎవరైనా సరే అంతం చేస్తామని ఇజ్రాయెల్ ఇదివరకే ప్రకటించింది.

### ఖమేనికి కంగ్రాట్స్ చెప్పిన పుతిన్.. ఇరాన్‌కు అండగా ఉంటామని హామీ

ఇరాన్ నూతన సుప్రీం లీడర్‌గా ఎన్నికైన అయతొల్లా మొజ్తాబా ఖమేనికి రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ అభినందనలు తెలిపారు. ఇరాన్‌కు మద్దతుగా ఉంటామని పుతిన్ హామీ ఇచ్చారు. ఈ మేరకు సోమవారం పుతిన్ ఒక ప్రకటన విడుదల చేశారు. "ఇరాన్ సుప్రీం లీడర్‌గా ఎన్నికైన మొజ్తాబాకు శుభాకాంక్షలు. ఈ క్లిష్ట సమయంలో ఇరాన్‌కు రష్యా అండగా నిలబడుతుంది. ఇరాన్‌లోని మా స్నేహితులకు, వారి సమగ్రతకు రష్యా మద్దతుగా ఉంటుంది. మొజ్తాబా తన తండ్రి వారసత్వాన్ని కొనసాగిస్తూ, ఇరాన్ ప్రజల్ని ఏకతాటిపైకి తెస్తారని భావిస్తున్నాం. యుద్ధం కొనసాగుతున్న ఈ సమయంలో నాయకత్వం వహించడానికి మొజ్తాబాకు గొప్ప ధైర్యం, పట్టుదల కావాలి" అని పుతిన్ తన సందేశంలో పేర్కొన్నారు.ఒకవైపు మొజ్తాబా ఎన్నికపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేస్తుంటే, రష్యా మాత్రం మద్దతుగా నిలవడం విశేషం. ఈ యుద్ధ సమయంలో ఇరాన్‌కు రష్యా నైతిక మద్దతు ప్రకటించింది.

## తెలంగాణ రైతుల సొమ్ముతో

# రాష్ట్రంలో 'రాహుల్ బంధు' పథకం

### కేటీఆర్ ఎద్దేవా



**సిరిసిల్ల :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 'రాహుల్ బంధు' అనే కొత్త పథకాన్ని ప్రవేశపెట్టా రని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఈ రాహుల్ బంధు పథ కాన్ని రైతులకు ఇచ్చే రైతుబంధు నిధులతో మొదలుపెట్టాడని విమర్శించారు. సిరిసి ల్ల మున్సిపల్ ఎన్నికల్లో ఇటీవల గెలుపొందిన బీఆర్ఎస్ కౌన్సిలర్ల ఆత్మీయ సన్మాన కార్యక్ర మంలో కేటీఆర్ మాట్లాడారు.సంవత్సరానికి రూ. 1,000 కోట్ల రూపాయలు రాహుల్ గాంధీకి ఇచ్చే రాహుల్ బంధు పథకం మాత్రం తెలంగాణలో పక్కాగా రేవంత్ రెడ్డి అమలు చేస్తున్నారని విమర్శించారు. రాహుల్ గాంధీ కుటుంబానికి ఎప్పుడు ఇబ్బంది అయినా వేల కోట్ల రూపాయలు పంపించేందుకు సీఎం ప్రయత్నం చేస్తున్నాడని, అం దుకే రాహుల్ గాంధీ కోసం బ్రహ్మాండమైన కొత్త పథకాన్ని తెలంగాణలో తీసుకువ చ్చారని ఆరోపిం చారు.రాష్ట్రంలోని రైతన్నలంతా తమకు రైతుబంధు వస్తుందని, కాం గ్రెస్ పార్టీ పెంచి ఇస్తామన్న నిధులను ఇస్తుందని ఎదురు చూస్తూ ఉంటే రేవంత్ రెడ్డి రైతుబంధును ఎగ్గొడుతున్నాడని పేర్కొన్నారు. ఇప్పటికే మూడుసార్లు రైతుబంధును ఎగ్గొట్టిన ముఖ్య మంత్రి ఈసారి కూడా రైతుబంధును ఎగ్గొట్టాడని మండిపడ్డారు. రైతులకు ఇవ్వాల్సిన రైతుబంధును పక్కన పెట్టి రాహుల్ బంధు పథకం ద్వారా తన సీటును కాపాడుకుం టున్నాడని వెల్లడించారు.రేవంత్ రెడ్డి సామంతు రాజు లెక్క రాహుల్ గాంధీ ఢిల్లీ గద్దెకు కప్పం కడుతున్నారని విమర్శించారు. పేదల భూములు గుంజుకొని, పేదల ఇండ్లు కూలగొట్టి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ రాహుల్‌కు కప్పం చెల్లిస్తు న్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. అందుకే హైదరాబాద్ నుంచి మొదలుకొని ఖమ్మం దాకా అన్ని చోట్ల పేదల ఇళ్లను కూలగొట్టి మరి వ్యాపారం చేసి డబ్బులు సంపాది స్తున్నారన్నారని విమర్శించారు. అందుకే రాష్ట్రంలో ఆరు గ్యారంటీలను మొదటి క్యాబినె ట్‌లో నిర్ణయం తీసుకొని చట్టబద్ధత కల్పించి, అమలు చేస్తామని రాహుల్ గాంధీతో సహా అందరూ చెప్పిన మాటలను గుర్తు చేస్తూ తెలంగాణ ప్రజలకు బాకీ పడిన ఆరు గ్యారంటీల చట్టాన్ని వచ్చే అసెంబ్లీ సమావేశాల్లోనే ప్రస్తావిస్తామన్నారు.

## ఆరు గ్యారెంటీల అమలుకు

## చట్టబద్దత కోసం అసెంబ్లీలో ప్రైవేట్ బిల్లు

ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ రానున్న అసెంబ్లీ సమావేశాల్లో ఒక ప్రైవేట్ మెంబర్ బిల్లును తీసుకువచ్చే విధంగా ప్రభుత్వంపైన బిల్లు పెట్టి ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత తీసుకువచ్చే విధంగా ప్రభుత్వం పైన ఒత్తిడి చేస్తామని కేటీఆర్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు కూడా ఈ ప్రైవేట్ మెంబర్ బిల్లుకు ఓటు వేయాల్సి వస్తుందని పేర్కొన్నారు. ఈ ప్రైవేట్ మెంబర్ బిల్లుకు కాంగ్రెస్ పార్టీ ముందుకు వచ్చి మద్దతు ఇచ్చి రాహుల్ గాంధీతో సహా , పార్టీ నేతలు ప్రజలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు.

జన్మదినోత్సవాలు,
పదవీ విరమణ
శుభాకాంక్షల
ప్రకటనల కోసం సంప్రదించండి
8074124190



## పశుపోషణపై పాడి రైతులకు అవగాహన



**జనోదయ, బెల్లంపల్లి, మార్చి 9:**

బెల్లంపల్లి మండలంలోని కన్నాల రైతు వేదికలో సోమవారం ఆత్మ ఆధ్వర్యంలో వ్యవసాయ అధికారులు పశుపోషణపై బెల్లంపల్లి, తాండూర్ , కాసిపేట మండలాల పాడి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆత్మ చైర్మన్ రౌతు సత్తయ్య మాట్లాడారు. దూడల పెంపకం, వ్యాధులు, వేసవి కాలంలో పశువుల కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పశువుల టీకాలు, గర్భకోశ వ్యాధులతో పాటు పొదుగు వాపు నివారణ పట్ల రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కన్నాల సర్పంచ్ నాతరి మల్లమ్మ, పశువైద్యాధికారులు డాక్టర్ దిలీప్ కుమార్, డాక్టర్ సరిత, డాక్టర్ నరసింహారావు, మూడు మండలాల పాడి రైతులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో భర్త మృతి

**-భార్యకు తీవ్ర గాయాలు -**



**జనోదయ : మందమర్రి మార్చి 9:**

పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మంచిర్యాలకు చెందిన బర్ల శంకర్ (64) తన భార్య రాజేశ్వరితో కలిసి ద్విచక్ర వాహనంపై మంచిర్యాల నుండి మందమర్రి మీదుగా నెన్నెల కు వెళ్తుండగా పట్టణంలోని హైవేపై ద్విచక్ర వాహనం అదుపు తప్పి డివైడర్ రెయిలింగ్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనం నడుపుతున్న బర్ల శంకర్ తలకు తీవ్ర గాయాలై ఘటన స్థలంలోనే మృతి చెందారు. వాహనం వెనుక కూర్చున్న ఆయన భార్య రాజేశ్వరికి తీవ్ర గాయాలు కావడంతో వెంటనే చికిత్స నిమిత్తం మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు మృతుడి కుమారుడు కార్తీక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై గోపతి నరేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

**ఆడబిడ్డ పెళ్లికి భరోసా కల్యాణ లక్ష్మి**

**ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం**

**జనోదయ : గంగాధర మార్చి 09:**

తెలంగాణ రాష్ట్రంలో ప్రజల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం పని చేస్తోందని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. సోమవారం గంగాధర మండల పరిషత్ కార్యాలయంలో కల్యాణ లక్ష్మి, ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను లబ్ధిదారులకు ఆయన పంపిణీ చేశారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 90 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి పథకం కింద రూ.90,10,440 ఆర్థిక సాయం మంజూరైనట్లు తెలిపారు. అలాగే 40 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి కింద రూ. 10,86,000 ఆర్థిక సహాయం అందినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాల ఆడబిడ్డల పెళ్లిళ్లకు కల్యాణ లక్ష్మి పథకం భరోసా కల్పిస్తోందని అన్నారు. అనారోగ్యం, ప్రమాదాల కారణంగా ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న పేద, మధ్యతరగతి ప్రజలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఆపద సమయంలో అండగా నిలుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ అంబటి రజిత, ఎంపీడీవో దామ్ రాము, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పురుమల్ల మనోహర్ తదితరులు పాల్గొన్నారు.





# మూసీని అభివృద్ధి చేసుకోవద్దా?

హైదరాబాద్ , మార్చి 9 :

"పేదల ఇళ్లు కూలగొట్టడం మా ప్రభుత్వ ఉద్దేశం కాదు. చెరువులు, నాలాలను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. దాంతో, వర్షం వస్తే ఇళ్లలోకి నీళ్లు వస్తున్నాయి. నిత్యావసరాలు పాడై ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఈ సమస్యలు తొలగించేందుకే చెరువులు, నాలాల పునరుద్ధరణ చేపడుతున్నాం. ఇందుకు సహకరించాలి. చెరువులు, నాలాలు ఆక్రమించుకున్న పెద్దలు, మిత్రులు, శ్రేయోభిలాషులు కూడా సహకరిస్తే బాగుంటుంది" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో రూ.20 కోట్లతో హైడ్రా అభివృద్ధి చేసిన నల్ల చెరువును సోమవారం ఆయన ప్రారంభించారు. చెరువు వద్ద గంగకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ.. పునరుద్ధరించిన చెరువుల వద్ద మహిళా స్వయంసహాయక సంఘాలకు స్టాల్స్ కేటాయిస్తున్నామని, వాకింగ్‌కు వచ్చేవారు నిత్యావసరాలు కొనుక్కెళ్లే అవకాశం ఉంటుందన్నారు."అహ్మదాబాద్‌లో సబర్మతి, ఢిల్లీలో యమున, ఉత్తరప్రదేశ్‌లో గంగ నదులను అభివృద్ధి చేసుకున్నారు. మూసీని మనం ఎందుకు అభివృద్ధి చేసుకోకూడదు!? మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ ఎందుకు చేసుకోకూడదో ప్రజలు ఆలోచించాలి. నదీ ప్రక్షాళనను అడ్డుకుంటే నగరానికి అన్యాయం చేసినట్లవుతుంది" అని సీఎం స్పష్టంచేశారు. దేశంలోని అన్ని ప్రధాన నగరాలు ఏదో ఓ సమస్యతో బాధపడుతున్నాయని, మన హైదరాబాద్ ఎంతో సురక్షిత నగరమని, దీన్ని మరింత పర్యావరణహితంగా మార్చేందుకు సహకరించాలని కోరారు. "ఢిల్లీలో కాలుష్యం తీవ్రంగా పెరిగి నివసించలేని దుస్థితి నెలకొంది. పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, చివరకు పార్లమెంట్‌కూ సెలవులిచ్చే పరిస్థితి వచ్చింది. ప్రధాని, రాష్ట్రపతి, కేంద్ర మంత్రులు, సుప్రీంకోర్టు వంటివి ఉన్న దేశ రాజధానిలో ముందుచూపు లేకపోవడం వల్లే ఈ దుస్థితి. ముంబైలో వాన పడితే ముంపు. బెంగళూరులో ట్రాఫిక్ సమస్య. చెన్నైలో అపార్ట్‌మెంట్లలోకి వరద నీరు వస్తోంది. కానీ, తెలంగాణలో కోర్ అర్బన్ రీజియన్ వరకు 3 కార్పొరేషన్లు ఏర్పాటు చేశాం. ఆ నగరాల్లా కాకుండా.. భవిష్యత్ తరాలకు ఇబ్బంది లేకుం డా కోర్ పరిధిలో చెరువులు, నాలాల పునరుద్ధరణ, పార్కులు, క్రీడా మైదానాల అభివృద్ధి, రోడ్ల నిర్మాణంతో హైదరాబాద్‌ను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తాం" అని సీఎం పిలుపునిచ్చారు. మూసీ అభివృద్ధి, రోడ్ల విస్తరణ, వంతెనల నిర్మాణ క్రమంలో ఆస్తులు కోల్పోయే వారికి పరిహారం ఇస్తామని, ఇళ్లు కోల్పోయే వారికి నివాసాలు కేటాయిస్తామని చెప్పారు. "రాజకీయంగా కష్టకాలంలో ఉన్నప్పుడు నాకు మీరు సహకరించారు. ఎంపీగా గెలిపించి ఢిల్లీకి పంపారు. ఇప్పుడు సీఎంగా ఉన్నా. మీ రుణం తీసుకోవాల్సిన బాధ్యత నాది. మల్కాజ్‌గిరి పార్లమెంట్ పరిధిలోని ప్రతి కాలనీ, బస్తీ అభివృద్ధికి కృషి చేస్తా ..ఉపాధి కోసం జిల్లాలు, రాష్ట్రాల నుంచి వచ్చేవారు ఉండేందుకు ప్రభుత్వ భూములు, చెరువుల పక్కన గుడిసెలు నిర్మించుకున్నారని, అభివృద్ధి కోసం వాటిని తొలగించినప్పుడు కొందరు పేదలకు నష్టం, ఇంకొందరికి దు:ఖం కలగొచ్చని, వారిలో అర్హులకు రెండు పడకల ఇళ్లు కేటాయిస్తామని హామీ ఇచ్చారు.

# ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం

**పట్టించుకోని అధికారులు**

**జనోదయ, మందమర్రి మార్చి 9:**

గ్రామీణ ప్రజలకు నిరంతరం నాణ్యమైన విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు అధికారులు విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి వాటి ఆధారంగా విద్యుత్ తీగల ద్వారా గ్రామాలకు విద్యుత్ సరఫరా చేస్తుండగా అధికారులు ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా మారి ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నప్పటికీ పట్టించుకోవడంలేదనే విమర్శలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి. మండలం లోని చిర్రకుంట గ్రామంలో విద్యుత్ సరఫరా కోసం ఏర్పాటు చేసిన ఇనుప విద్యుత్ స్తంభం వర్షానికి తడిసి ఎండకు ఎండుతూ తుప్పు పట్టి ఏ క్షణాన్నైనా కూలిపోయే ప్రమాదం ఉండడంతో గ్రామీణ ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. గ్రామాలకు వెలుగులు పంచే విద్యుత్ స్తంభాలు మృత్యు కుహరాలుగా మారక ముందే తుప్పు పట్టిన విద్యుత్ స్తంభాన్ని మార్చాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఇప్పటికే పలుమార్లు విద్యుత్ స్తంభం మార్చాలని కోరుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడంలేదని గ్రామస్తులు మండి పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నూతన విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.






జనోదయ



# టీచర్లపై ద్వేషం నిజమేనా?

ప్రజాప్రభుత్వం అధికారంలోకి రాకముునుపు నుండి విద్యను సంస్కరిస్తామని రాష్ట్ర నలుమూలలా విస్తృతంగా ప్రచారం చేశారు. మేనిఫెస్టోలో కూడా అనేక ఆశలు కల్పించారు. అనుకున్నట్లుగానే ప్రారంభంలో కొన్ని మార్పులు జరిగాయి. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల పేరిట  మౌలిక వసతులు మెరుగవ్వడం, పారిశుధ్య కార్మికుల కేటాయింపులు, ఉచిత విద్యుత్తు వంటివి ఒకటైతే, ఏళ్ళుగా నిలిచిపోయిన బదిలీలు, పదోన్నతులు, లెఫ్ట్ ఓవర్ ప్రమోషన్స్ వంటివి మరొకటైతే దశాబ్దాల డిమాండ్‌గా ఉన్న విద్యా కమిషన్ ఏర్పాటు అన్నింటికంటే ముఖ్యమైనది. ఆశలు కల్పించింది కూడా. కానీ అవి అడియాశలు కావడానికి ఎంతోకాలం పట్టలేదు.

## విద్యా కమిషన్ సంస్కరణల్లో వాస్తవాలు ఇవే...

**ఉపాధ్యాయుల జీతాలను, మార్కెట్ రేట్లకు పోల్చి దుబారా అరికట్టాలని చెప్పిన కమిటీ పెద్దలు నివేదిక రూపకల్పనకు ఆయన ప్రతి పైసా ఖర్చును పట్టిక రూపంలో ఇచ్చి నిబద్ధత చాటుకోవలసింది.**

నిజానికి ఇలాంటి కమిషన్లు ఇచ్చే నివేదికలు డ్రాఫ్ట్ రూపంలో ముందుగా పబ్లిక్‌కు అందుబాటులో ఉంచాలి. దానిపై తిరిగి విస్తృత చర్చ, అభ్యంతరాల స్వీకరణ జరగాలి. దానిని వాస్తవ రూపంలో విశ్లేషించాలి. తదనుగుణమైన  మార్పులు జరగాలి. అప్పుడు తుది నివేదిక వెల్లడి కావాలి.  కానీ అలా జరగలేదు. అకస్మాత్తుగా, ఏకంగా గుదిబండలా వచ్చి పడింది.



**నివేదికలోని ప్రతి సూచన ప్రస్తుత ఉపాధ్యాయులపై ద్వేషాన్ని, పగను, కక్షను రంగరించి రాసినట్లుగానే ఉంది. అందుకే పీజీలు చదివిన వారిని కాంట్రాక్ట్ పద్ధతిన నియమించాలని, ఉన్న వారిని ఏదో ఒక సాకుతో గెంటివేయాలన్నారు. తద్వారా ప్రభుత్వ కొలువులకు మంగళం పాడాలని చూసారు. అటు ప్రైవేట్‌లో నియమ నిబంధనలకు విరుద్ధంగా ఇస్తున్న తక్కువ వేతనాలను పోలికలో వాడుకున్నారు. కానీ కార్పొరేట్ సంస్థలు ఇస్తున్న లక్షలాది జీతాల మాట ఎత్తలేదు.**

ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాకముునుపు నుండి విద్యను సంస్కరిస్తామని రాష్ట్ర నలుమూలలా విస్తృతంగా ప్రచారం చేశారు. మేనిఫెస్టోలో కూడా అనేక ఆశలు కల్పించారు. అనుకున్నట్లుగానే ప్రారంభంలో కొన్ని మార్పులు జరిగాయి. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల పేరిట  మౌలిక వసతులు మెరుగవ్వడం, పారిశుధ్య కార్మికుల కేటాయింపులు, ఉచిత విద్యుత్తు వంటివి ఒకటైతే, ఏళ్ళుగా నిలిచిపోయిన బదిలీలు, పదోన్నతులు, లెఫ్ట్ ఓవర్ ప్రమోషన్స్ వంటివి మరొకటైతే దశాబ్దాల డిమాండ్‌గా ఉన్న విద్యా కమిషన్ ఏర్పాటు అన్నింటికంటే ముఖ్యమైనది. ఆశలు కల్పించింది కూడా. కానీ అవి అడియాశలు కావడానికి ఎంతోకాలం పట్టలేదు.

విద్యావేత్తలు, మేధావి వర్గం భంగపడ్డారు. మూడు దశాబ్దాల అనంతరం వచ్చిన జాతీయ నూతన విద్యావిధానాన్ని కాదని ప్రాంతీయ అవసరాలకు అనుగుణమైన కొత్త పాలసీ రూపుదిద్దుకుంటుందని, జనం మధ్యలో ఉన్న ఒక విశ్రాంత ఐఏఎస్ అధికారి జనాల అభీష్టాన్ని పట్టుకుంటారనుకున్నారు. కానీ, అదను కోసం, అవకాశం కోసం, టీచర్లపై ద్వేషాన్ని చిమ్మాలని చూస్తున్న వ్యక్తి అని గ్రహించలేకపోయారు. ఉపాధ్యాయ లోకం, ఉపాధ్యాయ సంఘాలు మరీ ముఖ్యంగా విద్యార్థి సంఘాలు వారిని ఆహ్వానించాయి. సమావేశాలకు స్వాగతించాయి. వారి వారి ఆలోచనలను, అభిప్రాయాలను వారితో పంచుకున్నారు. క్షేత్రస్థాయి అనుభవాల సారం ఎక్కడో ఒకచోట పాలసీలో పొందుపరచబడుతుందని ఆశ. ఇలా మిస్ ఫైర్ అవుతుందని ఎవ్వరు కలలో కూడా అనుకోలేదు.

నిజానికి ఇలాంటి కమిషన్లు ఇచ్చే నివేదికలు డ్రాఫ్ట్ రూపంలో ముందుగా పబ్లిక్‌కు అందుబాటులో ఉంచాలి. దానిపై తిరిగి విస్తృత చర్చ, అభ్యంతరాల స్వీకరణ జరగాలి. దానిని వాస్తవ రూపంలో విశ్లేషించాలి. తదనుగుణమైన  మార్పులు జరగాలి. అప్పుడు తుది నివేదిక వెల్లడి కావాలి. కానీ అలా జరగలేదు. అకస్మాత్తుగా, ఏకంగా గుదిబండలా వచ్చి పడింది. జీతభత్యాల ప్రస్తావన, హిందీ పరిచయం, మండలానికి కొన్ని పాఠశాలలు, తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు, కాంట్రాక్ట్ నియామకాలు ఇలా వాస్తవ దూరమైన అడ్డగోలు కూతలు ఉండడంతో అందరూ విస్మయానికి గురయ్యారు. ప్రస్తుత విధానాన్ని, ప్రస్తుత ఉపాధ్యాయులపై ఎక్కడా ప్రశంస లేదు, సానుకూల వ్యాఖ్యానం లేదు. పైపెచ్చు అందరూ దొంగలేనన్న అప్రత్యక్ష ఆరోపణలు. కేవలం పాఠ్య ప్రణాళికను, బోధనా పద్ధతులను, మౌళిక సదుపాయాలనే కాదు. ఏకంగా జీతభత్యాలు నిర్ణయించే త్రీమెన్ ఐఏఎస్ ల కమిటీని మార్కెట్ కంటే ఎక్కువ జీతాలిచ్చారని తప్పు పట్టారు. ఉపాధ్యాయులు పనిచేయడం లేదన్నారు. వీరికి మేధస్సు లేదని పరీక్షలు పెట్టాలన్నారు. రుజువు చేసుకోలేని వారిని ఉద్యోగం నుండి ఊడబెరకాలన్నారు. ఇక్కడ తగ్గించిన జీతాలను వసతుల కల్పనకు పెట్టాలని మరో తనదికాని సూచన ఒడిసి పట్టుకోమని పడేశారు. అటు సుప్రీం కోర్టుకు తీర్పును దాటి డీఎడ్ ఒక పనికిరాని కోర్సు అని దాన్ని తీసేయాలన్నారు. పీజీ ఉండాలన్నారు. మరోవైపు రాష్ట్రంలో ఉన్న పరీక్షలు, ఎస్సీఈఆర్టీ అమలుచేస్తున్న బోధనా పద్ధతులు వ్యవస్థ అంతా బట్టీయం అని, ఇది మారాలన్నారు. అంటే విద్యాహక్కు చట్టం మేరకు జరుగుతున్న నిరంతర సమగ్ర మూల్యాంకనం ఒక అరిగిపోయిన రికార్డు అన్నారు. అటు నివేదిక విడుదలయిన నుండి రచ్చ. విమర్శల పర్వం. ఎక్కడా సానుకూలత లేదు. దానికి వెటకారమైన సమాధానాలు. సమర్థించుకునే బుకాయింపులు. విమర్శించిన వారి అర్హతలను లెక్కించే అహంకార పూరిత ఆగ్రహం. తానే రాష్ట్రంలో తెలివైన వాడినన్న పరాకాష్టల పర్వం. ఆ స్వరం నిండా అపస్వరం.

రిపోర్టు చదవాలన్న ఆసక్తి ఎవరికీ లేదు. ఆది ఒక చెత్తకాగితమన్న ముక్తాయింపు. ప్రభుత్వం విద్య పట్ల చిత్తశుద్ధితో ఉంటుందని, అట్టి నివేదికను తోసి పెడుతుందని నమ్మకం. ఇలాంటి స్థితి, గతి గతంలో ఎక్కడా, ఎప్పుడూ ఇలాంటి నివేదికలకు పట్టి ఉండదు. కొఠారి కమిషన్ నివేదిక నేటికీ ఒక రిఫరెన్స్ గ్రంథంగా మిగిలిపోయింది. వారెప్పుడూ ఎవరో ఒకరిని టార్గెట్ చేసి దాడి చేస్తుండడం మనం చూసాం. ఈసారి అది ఉపాధ్యాయ, అధ్యాపక వర్గాల వంతు అవుతుందని అనుకోలేదు. జీతభత్యాలు కొత్త, పాత నియామకాల మేరకు ఉండదని, కేడర్ ల ప్రకారం ఉంటుందని తెలిసి జీతభత్యాల తగ్గింపు కొత్త నియామకాలకు మాత్రమే అని విమర్శలకు జడిసి ఓ కొట్టరాగం అందుకున్నారు.  నివేదికలోని ప్రతి సూచన ప్రస్తుత ఉపాధ్యాయులపై ద్వేషాన్ని, పగను, కక్షను రంగరించి రాసినట్లుగానే ఉంది. అందుకే పీజీలు చదివిన వారిని కాంట్రాక్ట్ పద్ధతిన నియమించాలని, ఉన్న వారిని ఏదో ఒక సాకుతో గెంటివేయాలన్నారు. తద్వారా ప్రభుత్వ కొలువులకు మంగళం పాడాలని చూసారు. అటు ప్రైవేట్ లో నియమ నిబంధనలకు విరుద్ధంగా ఇస్తున్న తక్కువ వేతనాలను పోలికలో వాడుకున్నారు. కానీ కార్పొరేట్ సంస్థలు ఇస్తున్న లక్షలాది జీతాల మాట ఎత్తలేదు. ఉపాధ్యాయులకు ఇస్తున్న గౌరవ మర్యాదలను, వేతన స్కేళ్ళను ఎక్కడ వారు తిరిగిన 14 దేశాల్లో కనీసం పరిగణనలోకి తీసుకున్నట్టు లేదు. వాటి ప్రస్తావన చేయాలనుకున్నప్పుడు ఆయా దేశాల మార్కెట్ రేట్లతో వేతనాలను పోల్చి చూడాల్సింది. లేదా ఆ అంశాన్ని తెర మీదకు తీసుకురాకుండా ఉండాల్సింది. అందుకే నేటి ఉపాధ్యాయ లోకం టీచర్లపై ద్వేషం, పగ, కక్ష, కుట్రలతోనే  వారు ఈ రచన చేసినట్టుగా భావిస్తున్నారు. అందుకే ఆ నివేదికను మూకుమ్మడిగా ఎమోషనల్ బాయ్ కాట్ చేశారు. నిజాం ప్రభుత్వానంతరం ఉపాధ్యాయ ఆత్మగౌరవంపై జరిగిన దాడిగా దీనిని భావిస్తున్నారు. అసలైతే ఇప్పటికే ఉద్యమాలు ఉగ్రరూపం దాల్చి ఉండేవి. కానీ ప్రభుత్వం మీద ఉన్న భరోసా ఆపేస్తున్నది. ఇప్పటికైనా ప్రభుత్వం చర్చలు జరిపి, దిద్దుబాటు చర్యలు చేపట్టాలి.

ఇక కమిషన్ తన నిజాయితీని చాటుకోవాలి. వారు సూచించిన సూచనలకు ప్రాతిపదికల సాక్ష్యాలను, వారు తల్లిదండ్రులతో, సంస్థలతో, టీచర్లతో వగైరా సమావేశాలు నిర్వహించినప్పుడు వెలిబుచ్చిన అభిప్రాయాల తాలూకు డాక్యుమెంట్లను బహిర్గతం చేయాలి. అనుభవం ఉన్న ఉపాధ్యాయుడిగా ఎక్కడ ఏ తండ్రి తన పిల్లలు వేరే చోటుకి వెళ్ళి చదవాలని కాంక్షించి ఉండరు. మౌఖికంగా చెప్పిన వాటిని పరిగణించడం అని దాటవేసే ధోరణి ప్రదర్శించకూడదు. కమిటీ సభ్యుల పరిచయం, వారికి విద్యా రంగానికి గల సంబంధాలు, వారి గత అనుభవాలు, వారు విద్యా రంగంలో చేసిన పని వంటి అంశాలు సభ్యునికి ఒకరికి చొప్పున ఒక్కొక్క పేజీలో వివరించి ఉండవలసింది. 14 దేశాల్లో తిరిగిన బృందం తాలూకు ఫోటోలు, సేకరించిన సమాచారాన్ని పబ్లిక్ డొమైన్‌లో పెట్టవలసింది. క్షేత్రస్థాయి టీచర్లను ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్ ఎక్స్పోజర్ పేరిట జిల్లాకు ముగ్గురు చొప్పున తీసుకెళ్లి వారి గమనికలు పరిగణనలోకి తీసుకుంటామని ఎంపిక చేసి, జిల్లాలకు కేటాయించిన డబ్బును తీసుకొని ఎందుకు తీసుకెళ్లకుండా సభ్యులు మాత్రమే వెళ్లడం వెనక మతలబు ఏమిటో తెలియజేయాలి. విదేశీ సమాచారం మన కాలమాన ప్రాంత ఆచార వ్యవహారాలకు, మన ఆర్థిక స్థితికి ఎలా సూట్ అవుతాయి అనేది జస్టిఫికేషన్ రాసి ఉండాల్సింది. అన్నింటికంటే మించి ఉపాధ్యాయుల జీతాలను, మార్కెట్ రేట్లకు పోల్చి దుబారా అరికట్టాలని చెప్పిన కమిటీ పెద్దలు నివేదిక రూపకల్పనకు ఆయన ప్రతి పైసా ఖర్చును పట్టిక రూపంలో ఇచ్చి నిబద్ధత చాటుకోవలసింది. 12 అధ్యాయాలను చదవకుండానే 354 పేజీలను తిరగేయకుండానే, ముఖ్యాంశాల 38 పేజీలతోనే ఒక సమగ్ర అవగాహన కలిగింది. అందుకే అంటారు కదా! అన్నం ఉడికిందా? లేదా? అన్నది ఒక్క మెతుకుతోనే తెలుస్తుందని. ఇక్కడ అదే జరిగింది.



దాసరి శ్రీధర్
LFLHM
MPPS Eradapally
Mandal : Shankarapatnam